8లో..

## గాంధీల పేరుతో కాంగ్రెస్ నయవంచన

**బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని**




# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 05 | సంచిక : 035
పేజీలు : 08 | వెల: రూ.5/-
మంగళవారం
జనవరి 13, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



వివరాలు2లో..





# ప్రజా సేవలో.. బాద్‌షా

ప్రజా సేవలో ఆయన బాద్ షా.. పేదల పాలిట ఆత్మబంధువు.. పాలనలో తనదైన మార్క్ చూపుతూ జనగామ జిల్లా సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తున్న ఆయనే జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా. ఐఏఎస్ కొలువు అంటేనే సవాళ్లతో సహవాసం. ప్రజా ప్రతినిధులు.. అధికారులు.. ఉద్యోగులు, ప్రజలను సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలంటే ఎంతో కష్టం. అలాంటి అనుమానాలను పటాపంచలు చేస్తూ జనగామ జిల్లా కలెక్టర్ గా షేక్ రిజ్వాన్ బాషా దూసుకుపోతున్నారు. ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తూ ప్రగతి సాధిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. పేదల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ఆయన పని చేస్తున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిస్తున్నారు. పాలనాధికారిగా ఆయన తన మార్కును చూపుతూ జిల్లా ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఆయన బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు అందరి సహకారంతో జిల్లాను ప్రగతి వైపు నడిపిస్తున్నారు. పేద ప్రజల సంక్షేమానికి నిరంతరం కష్టపడుతూనే జనగామ జిల్లాను అభివృద్ధి పథంలో నిలుపుతున్నారు. దేశవ్యాప్తంగా నాస్ (ఎన్ఏఎస్) లో తెలుగు రాష్ట్రాలనుంచి ఒక్క జనగామ జిల్లాకే చోటు లభించడంలో ఆయన కృషి ఎంతో ఉంది.







- పేదల ఆత్మబంధువు కలెక్టర్ 'రిజ్వాన్' బాషా
- పాలనలో తనదైన మార్క్
- జనగామ జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి
- పర్యాటక జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్లాన్
- నాస్ లో తెలుగు రాష్ట్రాలనుంచి ఒక్క జనగామకే చోటు




సకల భోగభాగ్యాలను పంచే సంక్రాంతి వచ్చేసింది. ఏటా మకర సంక్రమణ నాడు వచ్చే సంక్రాంతి తమ జీవితాల్లో సకల కాంతులను నింపుతుందని తెలుగు ప్రజల నమ్మకం. అందుకే ఈ పండుగ అచ్చ తెలుగుదనానికి ప్రతీక. ముత్యాల ముగ్గులు, ముంగిళ్లలో గొబ్బెమ్మలు, హరిదాసుల కీర్తనలు, బసవన్నల విన్యాసాలు, పిండి వంటల ఘుమఘుమలు, గాలిపటాలతో చిన్నారుల కేరింతల సందడితో తెలుగు లోగిళ్లు కళకళలాడుతున్నాయి. - వరంగల్ వాయిస్ ప్రతినిధి

## తెలుగు లోగిళ్లలో.. భోగి.. భాగ్యం

అచ్చ తెలుగుదనానికి ప్రతీక

8లో..



## ప్రజల గొంతుక వరంగల్ వాయిస్

**కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

వరంగల్ వాయిస్ దినపత్రిక–2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వరంగల్ వాయిస్ దినపత్రిక నిత్యం తాజా సమాచారంతో, ప్రజా సమస్యలను ప్రతిబింబిస్తూ ప్రజల గొంతుకగా నిలుస్తోందని కొనియాడారు. పత్రికా రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న వరంగల్ వాయిస్ యాజమాన్యానికి, సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లో పత్రిక మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ వాయిస్ దినపత్రిక ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, జనగామ జిల్లా రిపోర్టర్ ఉస్నగిరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

– వరంగల్ వాయిస్, జనగామ

వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
మంగళవారం, జనవరి 13, 2026



# ప్రజా సేవలో.. బాషా

## పేదల ఆత్మబంధువు కలెక్టర్ 'రిజ్వాన్' బాషా

**పాలనలో తనదైన మార్క్**

**జనగామ జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి**

**పర్యాటక జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్లాన్**

**నాస్‌లో తెలుగు రాష్ట్రాలనుంచి ఒక్క జనగామకే చోటు**



గడ్డం కేశవమూర్తి

జనగామ జిల్లాలోని అన్ని మండలాల్లో కలెక్టర్ రిజ్వాన్ బాషా సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. విద్య, వైద్యం, తాగునీటి రంగానికి ప్రాధాన్యతనిస్తూనే.. ప్రభుత్వాసుపత్రులు, పాఠశాలలు, హాస్టళ్లను ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి జనగామ జిల్లాను ఆరోగ్య జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో వసతులను మెరుగుపరిచారు. అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. విద్యపై ఫోకస్ పెట్టిన కలెక్టర్ విద్యారంగంలో పలు సంస్కరణలకు కృషి చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మకమైన విద్య అందే విధంగా చర్యలు తీసుకున్నారు. గురుకుల వ్యవస్థను గాడిలో పెట్టారు. నాణ్యమైన బోధన, మెరుగైన వసతులు కల్పించారు. చదువుకు పేదరికం అడ్డుకారాదని, గొప్ప వాళ్లంతా పేదరికాన్ని జయించిన వారేనని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతున్నారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిళ్లకు లోను కాకుండా విద్యపై దృష్టి సారించి ఎంచుకున్న లక్ష్యాలను సాధించుకోవాలని సూచిస్తున్నారు.

### అభివృద్ధి ప్రదాత..

జనగామ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. జిల్లాకు మంజూరైన 5,790 ఇళ్లలో ఇప్పటికే 78 శాతం గ్రౌండింగ్ పూర్తి చేశారు. మన జిల్లా.. మన నీరు కార్యక్రమాన్ని చేపట్టి విజయవంతం చేశారు. విద్యార్థుల కోసం దిక్సూచి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో పలుచోట్ల జంక్షన్లను అభివృద్ధి చేశారు. ధర్మ కంచలో మినీ స్టేడియాన్ని, అనాథ పిల్లల కోసం బాల సదనం నిర్మించారు. స్విమ్మింగ్ పూల్, వైకుంఠధామంను పునరుద్ధరించారు. మహిళల కోసం బతుకమ్మ కుంటను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జీజీహెచ్ , ఎంసీహెచ్ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. పాడి ప్రోకూర్మెంటు అధిక సంఖ్యలో చేసి రాష్ట్రంలో మొదటి స్థానం సాధించారు. జిల్లాకు రెండు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరుకాగా వాటికి భూమిని కేటాయించి టెండర్ ప్రక్రియ పూర్తి చేయడంలో ప్రత్యేక చొరవ చూపారు. ప్రస్తుతం పనులు పురోగతిలో ఉన్నాయి.

### పర్యాటక ప్రాంతంగా జనగామ జిల్లా..

స్వచ్ఛత, పచ్చదనం కోసం కలెక్టర్ రిజ్వాన్ బాషా ప్రయత్నిస్తున్నారు. మొక్కల సంరక్షణను ప్రధాన అంశంగా తీసుకొని అందరికీ అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. వరంగల్ నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రధాన జాతీయ రహదారిలో.. జనగామ వైపు వెళ్లే దారిలో స్వాగత తోరణం ఏర్పాటు చేయించారు. బొమ్మెర, వల్మిడి, పాలకుర్తి సోమనాథ ఆలయం అభివృద్ధికి కృషి జరుగుతోంది. మహిళల ఆర్థిక సాధికారత కోసం ఇందిరా మహిళా శక్తి పథకాలను అమలు చేస్తున్నారు. 22 టీ స్టాల్స్ ను మహిళా సంఘాలకు అప్పగించి వారికి ఉపాధి కల్పించారు. పాలకుర్తిలో ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఫంక్షన్ హాలును మహిళా సంఘాలకు అప్పగించి వారిని అన్ని విధాల ప్రోత్సహిస్తున్నారు. నిరుద్యోగ యువతను వ్యాపార రంగంలో ప్రోత్సహిస్తు ప్రభుత్వ పథకాలను అందిస్తున్నారు. యువతకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నారు. అదేవిధంగా.. దివ్యాంగులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నారు.

### ఎరువుల కొరత లేకుండా..

వ్యవసాయ సీజన్ లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూశారు. వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తూ ఎరువుల కొరత తీర్చారు. ఎరువుల విక్రయాలు, సరఫరా, వినియోగంపై పారదర్శకత, అవకతవకలు, అక్రమాలకు తావు లేకుండా తనఖీలు ముమ్మరం చేశారు. ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం చూపుతున్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేసిన ఆయన భూ భారతి దరఖాస్తులను పరిష్కరిస్తున్నారు. నిషేధిత జాబితాలోని భూములను రిజిస్ట్రేషన్లు చేయకుండా హుకుం జారీ చేశారు. అన్ని శాఖల అధికారుల వద్ద అప్డేట్ చేసిన నిషేధిత భూముల జాబితా ఉండేలా చర్యలు తీసుకున్నారు. క్రీడారంగాన్ని ప్రోత్సహిస్తున్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా క్షేత్రస్థాయిలో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

### కుటుంబ నేపథ్యం..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం రాయవరం గ్రామంలో 1988 ఆగస్టు 2న అబ్దుల్ మజీద్–షిరీ దంపతులకు షేక్ రిజ్వాన్ బాషా జన్మించారు. వీరి తల్లి గృహిణి కాగా, తండ్రి పోలీస్ శాఖలో సెక్షన్ సూపరిండెండెంటుగా పనిచేసి రిటైరయ్యారు. చెల్లెలు నదియా భాను, బావ వాసిం, తమ్ముడు సాజిద్ సాఫ్ట్ వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. రిజ్వాన్ బాషా ప్రకాశం జిల్లా దర్శి పట్టణంలోని ట్రినిటీ పబ్లిక్ స్కూల్ లో ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు చదివారు. చీరాలలోని ఆదిత్య పబ్లిక్ స్కూల్లో 8 నుంచి 10వ తరగతి పూర్తి చేశారు. విజ్ఞాన భారతి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ అభ్యసించారు. బాపట్లలోని ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశారు. 2009 నుంచి 2013 వరకు హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇన్ఫోసిస్ బహుళ జాతి సంస్థలో సాఫ్ట్ వేర్ ఇంజినీర్ గా పనిచేశారు. తర్వాత సివిల్ సర్వీస్ పై ఉన్న మక్కువతో ఆ వైపు వెళ్లారు. ఢిల్లీలోని శ్రీరామ్ ఇనిస్టిట్యూట్ లో కోచింగ్ తీసుకున్నారు. 2014లో ఐఐఎస్, 2015లో ఐసీఎల్ఎస్, 2016లో ఐఆర్ఏఎస్ ఉద్యోగాలు లభించాయి. 2017లో అఖిల భారత స్థాయిలో 48వ ర్యాంకు సాధించి ఐఏఎస్ సాధించారు. 2021 డిసెంబర్ 19న కడప జిల్లాకు చెందిన డాక్టర్ సయ్యద్ అమ్రిన్ ను రిజ్వాన్ బాషా వివాహం చేసుకున్నారు. వీరికి కుమారుడు ఆర్జాన్ పాజ్ జన్మించారు.

### ఉద్యోగ ప్రస్థానం..

యువ ఐఏఎస్ అధికారి రిజ్వాన్ భాషా శిక్షణ అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్ గా విధులు నిర్వర్తించారు. తర్వాత భూపాలపల్లి అడిషనల్ కలెక్టర్ గా, ఆదిలాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ గా సేవలందించారు. 2023 మార్చిలో వరంగల్ మున్సిపల్ కమిషనర్ గా బదిలీపై వెళ్లి 2024 ఫిబ్రవరి 25 వరకు పని చేశారు. ఏడాది పాటు వరంగల్ మహానగర సర్వతో ముఖాభివృద్ధికి పాటుపడ్డారు. 26 ఫిబ్రవరి 2024 నుంచి జనగామ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రిజ్వాన్ బాషా తన సర్వీసులో అనేక అవార్డులు, రివార్డులు సొంతం చేసుకున్నారు. రాష్ట్రీయ, జాతీయస్థాయిలో పురస్కారాలు పొంది ఆయన స్ఫూర్తిగా నిలిచారు.













# రోడ్డు భద్రతను ప్రజా ఉద్యమంగా మార్చాలి

● వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్



**వరంగల్ వాయిస్, దామెర :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'Arrive Alive' రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా మంగళవారం దామెర గ్రామ పరిధిలోని గురుకుల గ్రౌండ్ వద్ద ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించినప్పుడే రోడ్డు ప్రమాద రహిత రాష్ట్రాన్ని నిర్మించగలమని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. "ప్రజల భద్రతే మా బాధ్యత.. రోడ్డు భద్రతను ఒక ప్రజా ఉద్యమంగా మార్చాలి" అని ఆయన పిలుపునిచ్చారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అది ప్రాణరక్ష కవచమని వివరించారు. తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలు ఇచ్చి వారి ప్రాణాలను, ఇతరుల ప్రాణాలను ప్రమాదంలో పడేయవద్దని హెచ్చరించారు. మోటారు వాహన చట్టంపై అవగాహన కల్పిస్తూ, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిగే నష్టాలను వివరించారు. పరకాల ఏసీపి సతీష్ బాబు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరకాల రూరల్ సీఐ రంజిత్ రావు, దామెర ఎస్సై కొంక అశోక్, పోలీస్ సిబ్బందితో పాటు దామెర మండలానికి చెందిన సుమారు 300 మంది సర్పంచులు, స్థానిక నాయకులు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా 'రోడ్డు భద్రత మాసోత్సవం'

**వరంగల్ వాయిస్, రేగొండ :** రోడ్డు నిబంధనలను పాటించడం ద్వారా ప్రాణాపాయ ప్రమాదాలను అరికట్టవచ్చని గోరి కొత్తపల్లి ఎస్సై సాకపురం దివ్య పేర్కొన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు, వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై దివ్య మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా పది రోజుల పాటు రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. వాహనదారులు ప్రయాణించే సమయంలో సీటు బెల్టు, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. వాహనానికి సంబంధించిన ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని చెప్పారు. ప్రమాదాలకు కారణాలివే.. డ్రైవింగ్ చేసే సమయంలో సెల్ ఫోన్ మాట్లాడటం, మద్యం సేవించడం, నిద్రలేమి వంటి కారణాల వల్లే అత్యధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కండిషన్‌లో ఉన్న వాహనాలను మాత్రమే వాడాలని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నిమ్మల శంకర్, ఉప సర్పంచ్ సుధనబోయిన రవి, మాజీ సర్పంచ్ ఓం ప్రకాష్, పీఏసీఎస్ డైరెక్టర్ ఆవుల మహేందర్, సీనియర్ నాయకులు మట్కే సంతోష్, వార్డు సభ్యులు ధూమాల నాగేష్, కారోబార్ కట్ల నాగరాజు పాల్గొన్నారు. వీరితో పాటు వివిధ యూత్ అసోసియేషన్ల (స్నేహ, ఛాలెంజ్, యూనిక్) ప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.




# నిబంధనలు పాటిద్దాం.. ప్రాణాలను కాపాడుకుందాం

ఎస్సై త్రిలోక్ నాథ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, రేగొండ :** ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నిబంధనలను స్వచ్ఛందంగా పాటించినప్పుడే సురక్షిత సమాజాన్ని నిర్మించగలమని రేగొండ సెకండ్ ఎస్సై త్రిలోక్ నాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దమ్మన్నపేట గ్రామంలో 'Arrive Alive' క్యాంపెయిన్‌లో భాగంగా రోడ్డు భద్రతపై గ్రామస్తులకు, యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించడం వల్ల ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని తెలిపారు. "మద్యం సేవించి వాహనం నడపడం మీ ప్రాణాలకే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు" అని ఆయన హెచ్చరించారు. ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రథమ చికిత్స ప్రాముఖ్యత గురించి గ్రామస్తులకు వివరించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని, మద్యం సేవించి వాహనం నడపమని, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరిస్తామని వాహనదారులచే ఎస్సై ప్రతిజ్ఞ చేయించారు. మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో దమ్మన్నపేట సర్పంచ్ గంజి అరుణ రజనీకాంత్, ఉప సర్పంచ్, పోలీస్ కానిస్టేబుళ్లు పృథ్వీ, నరేష్, కుమార్, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

# అనాధలకు ప్రేమని పంచడమే సంక్రాంతి

◆ డాక్టర్ అనితా రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పండుగ పూట అనాధ పిల్లల ముఖాల్లో చిరునవ్వు చూడటమే నిజమైన ఆనందమని, వారికి అమ్మ ప్రేమను అందించడమే గొప్ప సంక్రాంతి సంబరమని వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ నేషనల్ వైస్ చైర్మన్, అనురాగ్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని హనుమకొండ కలెక్టరేట్ సమీపంలోని ప్రభుత్వ అనాధ బాలికల బాలసదనం ఆశ్రమంలో డాక్టర్ అనితా రెడ్డి ఆధ్వర్యంలో పిల్లలకు నూతన వస్త్రాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అనితా రెడ్డి మాట్లాడుతూ, "సాధారణంగా పండుగ అంటే తల్లిదండ్రులు తమ పిల్లలకు కొత్త బట్టలు కొని ఆనందంగా గడుపుతారు. కానీ ఈ పిల్లలకు తాము ఒంటరివారం కాదని, తమకు అందరూ ఉన్నారనే భరోసా కల్పించడానికే ఈ కార్యక్రమం చేపట్టాను" అని తెలిపారు. పిల్లలతో ముచ్చటిస్తూ, వారికి మంచి నడవడికతో చదువుకుని జీవితంలో ఒక లక్ష్యంతో ముందుకు ఎదగాలని ఓ అమ్మలా దిశానిర్దేశం చేశారు. వస్త్రాల పంపిణీ అనంతరం పిల్లలకు మరియు సిబ్బందికి వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం-2019 పై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే వాటిని సరిగ్గా వినియోగించుకోగలరని, ముఖ్యంగా విద్యార్థులు చిన్నతనం నుంచే చట్టాల పట్ల అవగాహన పెంచుకోవాలని ఆమె సూచించారు. చదువును అశ్రద్ధ చేయకుండా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిల్లలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ సిబ్బంది, బాలికలు, కన్స్యూమర్ రైట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. చివరగా అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆలయాల నిర్మాణ పనులు ప్రారంభం



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ఆశీస్సులతో, భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రత్యేక చొరవతో బుధవారం గణపురంలో రెండు ప్రముఖ దేవాలయాల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఉదయం 9:00 గంటలకు గణపురం కోటకాల్వ సమీపంలో గౌడ కులస్తుల ఇలవేల్పు శ్రీ ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణ ప్రారంభోత్సవం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి గౌడ సోదరులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. గణపురం చెరువు కట్టపై కొలువుదీరిన దక్షిణ ముఖ ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు కూడా ఇదే వేళలో ప్రారంభం కానున్నాయి. ఈ పవిత్ర కార్యక్రమాలకు మండలంలోని ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, పుర ప్రముఖులు, భక్తజనం అధిక సంఖ్యలో పాల్గొని, ఈ నిర్మాణ క్రతువును దిగ్విజయం చేయవలసిందిగా నిర్వాహకులు కోరారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సహకారంతో మండలంలో ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు.

# పరకాల అయ్యప్ప ఆలయంలో రేపు 'మకర జ్యోతి' దర్శనం



**వరంగల్ వాయిస్, పరకాల:** శబరిమల మకర విలక్కు జ్యోతి దర్శన పర్వదినాన్ని పురస్కరించుకుని, బుధవారం పరకాల పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు. బుధవారం సాయంత్రం శబరిమలలో మకర జ్యోతి దర్శన సమయానికి అనుగుణంగా, ఇక్కడ కూడా జ్యోతి దర్శనం మరియు అత్యంత భక్తిశ్రద్ధలతో పడిపూజ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అయ్యప్ప స్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి మండలంలోని అయ్యప్ప మాలధారులు, గురుస్వాములు, భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. జ్యోతి దర్శనం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని అయ్యప్ప స్వామి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ కూరగాయల మార్కెట్ కమిషన్ వ్యాపారస్తుడు శేర్ల మల్లేశం అకాల మరణం మార్కెట్ వర్గాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఆయన మృతి పట్ల వరంగల్ కూరగాయల వ్యాపారస్తుల పరపతి సంఘం నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం ప్రకటించారు. మల్లేశం పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించేందుకు పరపతి సంఘం ముందుకొచ్చింది. సంఘం తరపున బాధితులకు రూ.60,000 ఆర్థిక సాయాన్ని సంఘం అధ్యక్షుడు బేతి అశోక్ బాబు, ఇతర నాయకులు కలిసి అందజేశారు. కష్టకాలంలో తోటి వ్యాపారి కుటుంబానికి అండగా ఉంటామని ఈ సందర్భంగా వారు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బాబురావు, రాజు, రవి, భద్రయ్య, మల్లేశం, కుమార్ స్వామి, గాంధీ, యాదగిరి, మురళి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. మల్లేశం మృతి మార్కెట్ వ్యాపారులకు తీరని లోటని వారు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

# పద్మశాలీల రాజకీయ ఎదుగుదలే లక్ష్యం

**నేతన్నల సంక్షేమానికి ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలి**

**చిలుకమారి వెంకటేశ్వర్లు డిమాండ్**



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** రాబోయే జడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికల్లో పద్మశాలీలు ఐక్యంగా పోరాడి రాజకీయంగా ఎదగాలని టీపీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు చిలుకమారి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ కుల బాంధవుల భవిష్యత్తు, రాజకీయ ప్రాతినిధ్యంపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం 30 మంది పద్మశాలీలు పోటీ చేసి, అందులో 20 మంది విజయం సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన కోరారు. ఇందుకోసం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఒక రాజకీయ నిధిని ఏర్పాటు చేయాలని, కులంలోని ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు, డాక్టర్లు, ఉన్నత వర్గాల వారు ఆర్థికంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయంగా ఎదిగినప్పుడే కుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ, పద్మశాలీల సంక్షేమం కోసం ఈ కింది డిమాండ్లను వారి దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి మండలం లోని నేతన్నలకు వ్యాపారాల కోసం ఎకరం భూమి కేటాయించాలి. పవర్ లూమ్స్ ఏర్పాటు మరియు కమ్యూనిటీ భవనాల కోసం రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయాలి. గతంలో ఉన్న సొసైటీల బకాయిలను రద్దు చేసి, నేతన్నలను ఆదుకోవాలి. పద్మశాలీ నేత, టీపీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కామర్తపు మురళి సేవలను గుర్తించి వారికి కార్పొరేషన్ పదవి కేటాయించాలని కోరారు. తమ కుటుంబం గత 60 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా ఉందని, తన తండ్రి దివంగత రాంగోపాల్ గారు 30 ఏళ్లు పార్టీ కోసం పని చేశారని గుర్తు చేశారు. తాను కూడా మహబూబాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, గత 30 ఏళ్లుగా కుల ప్రతినిధిగా సేవలందిస్తున్నట్లు తెలిపారు. పాత కాంగ్రెస్ కుటుంబాలను ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో సర్పంచులుగా, వార్డు మెంబర్లుగా గెలుపొందిన పద్మశాలీలకు ఆయన అభినందనలు తెలిపారు. కుల బాంధవులంతా అష్టైశ్వర్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# ప్రమాదాల నివారణే పోలీసుల లక్ష్యం

**జనగామ డీసీపీ రాజ మహేందర్ నాయక్**



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించిందని జనగామ డీసీపీ రాజ మహేందర్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై గల కొమ్మల టోల్ గేట్ వద్ద రఘునాథపల్లి పోలీసులు నిర్వహించిన 'Arrive Alive' అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, ప్రస్తుతం ఐలోని, కొమురవెల్లి, మేడారం జాతరల సీజన్ ప్రారంభమైనందున జాతీయ రహదారిపై రద్దీ పెరుగుతుందని, భక్తులు, ప్రయాణికులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "ప్రతి వాహనదారుడు స్వీయ భద్రతతో పాటు ఇతరుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలి. అప్రమత్తతతోనే సురక్షిత ప్రయాణం సాధ్యం" అని ఆయన స్పష్టం చేశారు. రూరల్ సీఐ అడవెల్లి శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీసులు వాహనదారులను ఆపి, వారికి రోడ్డు భద్రతా నియమాలను వివరించారు. నిబంధనలు పాటించాలని కోరుతూ వాహనదారులకు పూలు అందజేసి వినూత్నంగా అవగాహన కల్పించారు. సుమారు 200 మందికి పైగా వాహనదారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలి. అతివేగం ప్రాణాంతకమని, మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని హెచ్చరించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు మొబైల్ ఫోన్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలి. రాత్రి వేళల్లో లైట్లు, ఇండికేటర్లు సరిగా పనిచేసేలా చూసుకోవాలి. రఘునాథపల్లి ఎస్సై నరేష్ యాదవ్, పోలీస్ సిబ్బంది, టోల్ ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

# జంక్షన్ల సుందరీకరణ పనులు వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- గోకుల్ నగర్ జంక్షన్‌లో క్షేత్రస్థాయి పరిశీలన
- అధికారులకు కీలక ఆదేశాలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో భాగంగా నగరంలోని ప్రధాన జంక్షన్‌ల సుందరీకరణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన గోకుల్ నగర్ జంక్షన్‌లో ఇంజినీరింగ్, విద్యుత్తు, టౌన్ ప్లానింగ్, పోలీస్ శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వర్షాకాలంలో వరద నీరు రోడ్లపై నిలిచి ప్రజలు ఇబ్బంది పడకుండా శాశ్వత పరిష్కారం కనుగొనాలని సూచించారు. నాలాల వెడల్పు తక్కువగా ఉండటం వల్ల నీరు నిలిచి రోడ్లు దెబ్బతినే అవకాశం ఉందని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర డ్రైనేజీ ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. "అభివృద్ధి పనులు కేవలం కాగితాలకే పరిమితం కాకూడదు, క్షేత్రస్థాయిలో ప్రజలకు ఫలితాలు కనిపించాలి" అని ఎమ్మెల్యే అన్నారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు కనీస ఇబ్బందులు కలగకుండా సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బంక సంపత్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, డివిజన్ అధ్యక్షులు బంక సతీష్, నాయకులు నాయిని లక్ష్మా రెడ్డి, అశ్విన్ రాథోడ్, మండల సమ్మయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల క్షేత్రస్థాయి పరిశీలన



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని కొగిలివాయి గ్రామంలో వరంగల్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు మంగళవారం క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సాగవుతున్న వివిధ పంటలను పరిశీలించి, రైతుల సాగు పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు గ్రామ సర్పంచ్ చుక్క వనిత, అసిస్టెంట్ ప్రొఫెసర్ కిషోర్ కుమార్ పర్యవేక్షణలో వరి, మిరప, మొక్కజొన్న, పసుపు పంటలను సందర్శించారు. రైతులు అనుసరిస్తున్న ప్రస్తుత సాగు విధానాలను గమనించిన విద్యార్థులు, చీడపీడల నివారణ మరియు ఎరువుల యాజమాన్యంపై రైతులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ, రైతులు సంప్రదాయ పద్ధతులతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవరచుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారుల సలహాలను పాటిస్తూ, సరైన సమయంలో మేలైన విత్తనాలు, ఎరువులను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రశాంత్, ఏఈఓ రామకృష్ణ, రైతు సమన్వయ సమితి ప్రతినిధులు, రైతులు వెంకన్న, సురేష్, గోల్కొండ శ్రావణ్, తేలిక సుధీర్, రంగారెడ్డి, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల చొరవను, వారికి సహకరించిన అధికారులను గ్రామస్తులు అభినందించారు.

# 'మేడారం జాతర చరిత్ర' పుస్తకావిష్కరణ

**రచయితను అభినందించిన మంత్రి కొండా సురేఖ**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందిన మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర ఘన చరిత్రను భావితరాలకు అందించడం అభినందనీయమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంగళవారం హన్మకొండలో గీసుకొండ మండలం ఏలుకుర్తి హవేలీ గ్రామానికి చెందిన రచయిత, తెలుగు భాషా పండిత సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్ధోజు శ్రీనివాసచారి రచించిన 'మేడారం సమ్మక్క సారలమ్మ జాతర చరిత్ర' పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మేడారం జాతర విశిష్టతను, తల్లుల పోరాట పటిమను భక్తులకు వివరించాలనే సదుద్దేశంతో ఈ పుస్తకాన్ని తీసుకువచ్చిన శ్రీనివాసచారిని ప్రత్యేకంగా ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలపై ఆ తల్లుల దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని ఆమె కోరారు. ఎంతో మహిమాన్వితమైన సమ్మక్క–సారలమ్మలను ప్రతి ఒక్కరూ దర్శించుకుని పునీతులు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సన్నూరు వెంకటేశ్వర స్వామి దేవాలయ ముఖ్య అర్చకులు ఆరుట్ల వెంకటరామకృష్ణమాచార్యులు, కామధేను వేద విద్యాపీఠం ట్రస్టు చైర్మన్ చిలుకూరి నాగేంద్ర కుమార్, వాస్తు జ్యోతిష పండితులు బ్రహ్మశ్రీ నర్సింగోజు బ్రహ్మాచార్యులు పాల్గొన్నారు. వీరితో పాటు ఆడెపు కుమార స్వామి, విశ్వేశ్వర సామిల్ మేనేజర్ మార్త రమేష్, ప్రముఖ వ్యాపారి గన్ను శ్రీనివాస్ తదితరులు హాజరై రచయితను అభినందించారు.

# గ్రామీణ క్రీడలు స్నేహభావ దీపికలు

**◆ ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచందర్ నాయక్**



**వరంగల్ వాయిస్, సీరోల్/డోర్నకల్ :** క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వానికి ఎంతో దోహదపడతాయని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా సీరోల్ మండలం కాంపల్లి గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ యువత క్రీడల్లో చురుగ్గా పాల్గొనడం శుభపరిణామన్నారు. క్రీడల వల్ల కేవలం ఆరోగ్యం మాత్రమే కాకుండా క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాలు అలవడతాయని పేర్కొన్నారు. యువత క్రీడలను కేవలం వినోదంగానే కాకుండా, తమ ఉజ్వల భవిష్యత్తుకు పునాదిగా మార్చుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడారంగానికి పెద్దపీట వేస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తుందని ఆయన తెలిపారు. అందుబాటులో ఉన్న అవకాశాలను యువత సద్వినియోగం చేసుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు. టోర్నమెంట్‌ను ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ నాయక్, సీరోల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, కాలం రవీందర్ రెడ్డి, సురేష్ నాయక్, గండ్రాంతి సత్యం, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మనువాద దాడులను తిప్పికొట్టాలి

- తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు
- ఘనంగా ముగ్గుల పోటీలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహిళల సంస్కృతి, సంప్రదాయాలపై జరుగుతున్న మనువాద, కార్పొరేట్ దాడులను ఐక్యంగా తిప్పికొట్టాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయం వద్ద భారతీయ మహిళా సమాఖ్య జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ శక్తుల విష సంస్కృతి పెరిగిందని, మహిళలను కేవలం మార్కెట్ వస్తువులుగా చిత్రీకరిస్తూ వారిపై దాడులకు తెగబడుతున్నారని ఆరోపించారు. ప్రజల ఆహారపు అలవాట్లు, కట్టుబట్టలు మరియు విశ్వాసాలపై నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పండుగలకు కూడా మతం రంగు పులిమి స్వార్థ రాజకీయాలకు వాడుకుంటున్నారని, ఆర్ఎస్ఎస్ విష సంస్కృతికి వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలని ఆయన కోరారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి మాట్లాడుతూ.. ముగ్గులు మన సంస్కృతిలో అంతర్భాగమని, అవి మహిళల సృజనాత్మకతకు, కళాత్మకతకు నిదర్శనమని అన్నారు. గ్రామీణ కళలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహించామని తెలిపారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. పాల్గొన్న మహిళలందరికీ కన్సోలేషన్ బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మండ సదాలక్ష్మి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాసమల్ల దీనా, మంచాల రమాదేవి పాల్గొన్నారు. వీరితో పాటు సీపీఐ నాయకులు మద్దెల ఎల్లేష్, ఎన్.అశోక్ స్టాలిన్, గోపాల్‌పూర్ సర్పంచ్ కర్రె లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రైతు సమస్యల పరిష్కారమే సమితి లక్ష్యం

### నాగూర్ల వెంకటేశ్వర్లు



**వరంగల్ వాయిస్, పరకాల :** రాష్ట్రంలోని అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల సాధన కోసం రైతు రక్షణ సమితి నిరంతరం అండగా నిలుస్తుందని రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్, హనుమకొండ జిల్లా అధ్యక్షుల ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగూర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం సమితి చేపడుతున్న సామాజిక కార్యక్రమాలు, పోరాటాలు అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని సన్నకారు రైతుల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో సమితి కీలక పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్ రావు, హనుమకొండ జిల్లా అధ్యక్షులు హింగే భాస్కర్, సలహాదారులు సుధాకర్, ఉపాధ్యక్షులు చవుల్ల రామారావు, హింగే రవీందర్, కార్యదర్శి సురావు బాబురావు పాల్గొన్నారు. వీరితో పాటు జిల్లా నాయకులు అంబిరి శ్రీనివాస్, నడికూడ, ఎల్కతుర్తి, పరకాల మండలాల అధ్యక్షులు వాంకే రాజు, కొక్కు తిరుపతి, లక్కర్స్ మధుకర్, కమలాపూర్ ప్రధాన కార్యదర్శి తిప్పారపు సుధాకర్, ఎల్కతుర్తి ప్రధాన కార్యదర్శి కొదటి మాధవరావు, రైతు నాయకుడు గొనే సతీష్ హాజరయ్యారు.

## ముగ్గుల పోటీలతో వెల్లివిరిసిన సంక్రాంతి శోభ

### మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** సంక్రాంతి పండుగ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతిబింబమని, మహిళల సృజనాత్మకతకు ముగ్గుల పోటీలు వేదికగా నిలుస్తాయని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. మంగళవారం డోర్నకల్ పట్టణ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రెడ్యానాయక్ మాట్లాడుతూ.. అనాదిగా మన పూర్వీకులు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఇరుగుపొరుగు వారితో కలిసి సంతోషంగా గడిపేందుకు పండుగలను రూపొందించారని తెలిపారు. ముఖ్యంగా మూడు రోజుల పాటు జరిగే సంక్రాంతి పండుగ ఎంతో విశిష్టమైనదని, మహిళల సందడితో గ్రామాలు, పట్టణాలు కళకళలాడుతాయని పేర్కొన్నారు. మన సంస్కృతిని కాపాడుకోవడానికి ప్రజలందరూ కలిసికట్టుగా ఉండాలని ఆయన సూచించారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు రెడ్యానాయక్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పట్టణాధ్యక్షులు కత్తెరసాల విద్యాసాగర్, చేరెడ్డి భిక్షం రెడ్డి, బానోత్ పాండు నాయక్, సంధ్యారాణి రమేష్, మౌనిక యశోదర్ జైన్, అరుణా మధు, కొత్త రాధిక వీరన్న, తవ్వ వరలక్ష్మి, పోటు ఉషా జనార్ధన్, వెంకటమ్మ, బాలు నాయక్, రాంభద్రం, మియా, శ్రీనివాస్ నాయక్, భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# డబ్బుల కోసం వేధిస్తే సహించేది లేదు

- మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ పోలీస్ శాఖలోని కొందరు అధికారులు అధికార పక్షానికి కొమ్ముకాస్తూ, సామాన్య ప్రజలను, బీఆర్ఎస్ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం డోర్నకల్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పోలీసులు కావాలనే డబ్బుల కోసం వేధింపులకు పాల్పడుతున్నారని, అక్రమ కేసులు పెట్టి సామాన్యులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని రెడ్యానాయక్ ఆరోపించారు. "నాకు పోలీసు వ్యవస్థ అన్నా, మహిళలు అన్నా అపారమైన గౌరవం ఉంది. కానీ కొందరు అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి విధి నిర్వహణను విస్మరిస్తున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తనపై అకారణంగా కేసు పెట్టిన ఓ అధికారి, కొద్ది రోజుల్లోనే ఏసీబీకి చిక్కిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేసిన ఆయన, ఇప్పుడు వేధింపులకు పాల్పడుతున్న పోలీసులు ఎక్కడున్నా వదిలిపెట్టబోమని, అందరినీ గుర్తుపెట్టుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి పక్షపాత వైఖరి వల్ల పోలీస్ వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకం దెబ్బతింటోందన్నారు. సంక్రాంతి పండుగ ముగిసిన వెంటనే డీఎస్పీ, ఎస్పీలను కలిసి ఇక్కడి పరిస్థితులపై ఫిర్యాదు చేస్తానని ఆయన వెల్లడించారు.

## క్రీడాకారులకు క్రికెట్ కిట్లు పంపిణీ



**వరంగల్ వాయిస్, రేగొండ :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ నిజంపల్లి గ్రామ సర్పంచ్ నంద్రే సునీత రవీందర్ మంగళవారం గ్రామ యువతకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. గ్రామంలోని క్రీడాకారులకు క్రికెట్, వాలీబాల్ కిట్లను అందజేసి వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో యువతకు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దృఢత్వాన్ని అందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. క్రీడల వల్ల మానసిక ఒత్తిడి తగ్గి, క్రమశిక్షణ అలవడుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి ప్రోత్సాహకాలు ఎంతో అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచి, క్రీడల వైపు మళ్ళించాలనే సామాజిక బాధ్యతతోనే ఈ కిట్లను అందజేస్తున్నట్లు సునీత రవీందర్ తెలిపారు. భవిష్యత్తులో కూడా క్రీడాకారులకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తో పాటు యూత్ నాయకులు అచ్చ దేవేందర్, గూడ నరేష్ వర్మ, బుర్రి రాజమౌళి, కానుగంటి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. సర్పంచ్ చేసిన ఈ ఆర్థిక సహాయం పట్ల గ్రామ యువత హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం

### కార్పొరేటర్ పల్లం పద్మ రవి




**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా బాట' కార్యక్రమంలో భాగంగా వరంగల్ తూర్పు నియోజకవర్గం 32వ డివిజన్ పరిధిలోని బీఆర్ నగర్ లో విద్యుత్ సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ పల్లం పద్మ రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం ఇంకా ఎవరికైనా వర్తించకపోయినా లేదా సమస్యలు ఉన్నా వెంటనే స్పందించాలని కోరారు. అర్హులైన వారు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కరెంటు బిల్లు పత్రాలతో వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డివిజన్‌లో వేలాడుతున్న విద్యుత్ తీగలు, లో-వోల్టేజ్ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణపై కార్పొరేటర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఏడీ, ఏఈ స్పందిస్తూ.. గుర్తించిన సమస్యలను అతి త్వరలోనే యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు దేవరాయి సంపత్, కృష్ణ బోడ, తిరుమలేశ్ పోషల, దుప్పటి భిక్షపతి, సాంబయ్య, శరత్, రాముల నాయక్ పాల్గొన్నారు. వీరితో పాటు కాంగ్రెస్ నాయకులు అనిల్, అహ్మద్, శీను, స్థానిక మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## మాజీ సర్పంచ్ తల్లికి ఘన నివాళి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామ మాజీ సర్పంచ్ ప్రభాకర్ తల్లి ఇటీవల మరణించగా, మంగళవారం ఆమె దశదిన కర్మ సందర్భంగా మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు నివాళులర్పించారు. గ్రామంలోని సమాధి వద్దకు చేరుకున్న ఆయన, పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మాజీ సర్పంచ్ ప్రభాకర్, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారిని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ప్రముఖ నాయకులు గోనె సంపత్, లూనావత్ పంతులు, లూనావత్ బిక్షనాయక్, మహ్మద్ సర్వర్, గాడి పెల్లి రామ్మూర్తి, మదన్ మోహన్, రాములు కేదారి, యాకయ్య, మహబూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పేదవాడి ఇంట్లో 'గృహజ్యోతి' వెలుగులు

## తాడిచెర్లలో పత్రాల పంపిణీ




**వరంగల్ వాయిస్, మల్హర్ (తాడిచెర్ల) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల్లో భాగంగా 'గృహజ్యోతి' పథకం లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ పత్రాలను పంపిణీ చేశారు. మంగళవారం మండల కేంద్రమైన తాడిచెర్లలో విద్యుత్ శాఖ మండల ఇంఛార్జి ఏఈ శేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఈ శేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ 'జీరో బిల్లు'లను జారీ చేస్తోందని తెలిపారు. తాడిచెర్ల గ్రామంలో సుమారు 1500 మంది అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, వారికి సంబంధించిన పథక పత్రాలను స్వయంగా అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 52,82,489 కుటుంబాలకు గృహజ్యోతి పథకం ద్వారా లబ్ధి చేకూరుతోందని, ఇందుకోసం ప్రభుత్వం రూ. 3,593 కోట్ల భారాన్ని భరిస్తోందని వివరించారు. ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ లైన్ మెన్ రవి, జెఎల్ఎం మహేందర్, ఆన్ మ్యాన్ ఇందారపు రాజేష్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. తమకు జీరో విద్యుత్ బిల్లులు రావడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# బండి సంజయ్‌ను కలిసిన సర్పంచ్



**వరంగల్ వాయిస్, దామెర :** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ని మంగళవారం కోగిల్వాయి గ్రామ భారతీయ జనతా పార్టీ సర్పంచ్ చుక్క వనిత మహేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కొండి జితేందర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు జంగిలి నాగరాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ అంజి రెడ్డి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** చారిత్రక వరంగల్ భద్రకాళి అమ్మవారిని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజి రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు, ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజి రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. దర్శనం అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు నరసింహమూర్తి శర్మ ఎమ్మెల్సీకి అమ్మవారి శేష వస్త్రాన్ని, తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనాలు పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త తొనుపునూరి వీరన్న, రమేష్ శర్మ, సిద్ధేశ్వర శర్మ, ఆలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

# మానవ సేవలో మెల్విన్ జోన్స్ ఆదర్శప్రాయుడు


◆ కన్నా పరశురాములు



**వరంగల్ వాయిస్, జనగామ :** 'వి సర్వ్' అనే గొప్ప నినాదంతో ప్రపంచవ్యాప్తంగా సేవా విప్లవాన్ని సృష్టించిన మహనీయుడు మెల్విన్ జోన్స్ అని లయన్స్ పూర్వ జిల్లా గవర్నర్ లయన్ కన్నా పరశురాములు కొనియాడారు. లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ 147వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం పట్టణంలోని ఏకశిల పబ్లిక్ స్కూల్ ఆవరణలో జనగామ లయన్స్ క్లబ్ ల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కన్నా పరశురాములు మెల్విన్ జోన్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1879లో జన్మించిన మెల్విన్ జోన్స్, 1917లో లయన్స్ సంస్థను స్థాపించి 1961లో తనువు చాలించే వరకు మానవ సేవకే అంకితమయ్యారని గుర్తు చేశారు. ప్రపంచవ్యాప్తంగా అంధత్వ నివారణే లక్ష్యంగా ప్రారంభమైన ఈ సంస్థ, నేడు 210 దేశాలకు విస్తరించి ఎనిమిది ప్రధాన సామాజిక అవసరాలపై (డయాబెటిస్, పర్యావరణం, ఆకలి నివారణ వంటివి) పనిచేస్తోందని తెలిపారు. "ఎక్కడ అవసరముంటే అక్కడ లయన్ ఉంటాడు" అనే లక్ష్యంతో పనిచేస్తున్న లయన్స్ క్లబ్ లలో సంఖ్య పెరగాలని, సేవా దృక్పథం ఉన్న ప్రతి ఒక్కరూ ఇందులో చేరి సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ రామీని శ్రీనివాసులు, జిల్లా చీఫ్ సెక్రటరీ అడ్మినిస్ట్రేషన్ చంద్రగిరి ప్రసాద్, లియో జిల్లా చైర్మన్ గంగిశెట్టి ప్రమోద్ కుమార్, జోన్ చైర్మన్ కుతాటి ఉప్పలయ్య పాల్గొన్నారు. వీరితో పాటు జిల్లా నాయకులు నాగబండి రవీందర్, చందుపట్ల రవీందర్ రెడ్డి, రవి నాయక్, వివిధ క్లబ్ ల అధ్యక్షులు బండ దయాకర్ రెడ్డి, భోగ రామ్ దయాకర్, జి. శివరామ కృష్ణ, పరుష సిద్దయ్య, వై. లక్ష్మినారాయణ, డా.పి.సత్యం తదితరులు నివాళులర్పించారు. ప్రారంభంలో జిల్లా మార్కెటింగ్ చైర్మన్ లయన్ క్రిష్ణ జీవన్ బజాజ్ స్వాగతం పలకగా, హోస్ట్ క్లబ్ జనగామ ఆబాద్ అధ్యక్షుడు లయన్ కారంపూడి సతీశ్ వందన సమర్పణ చేశారు.

# రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరి

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** వాహనదారుల చిన్నపాటి నిర్లక్ష్యం నిండు ప్రాణాలను బలితీసుకుంటుందని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా ప్రయాణించాలని ఆత్మకూరు సీఐ సంతోష్ కోరారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై పోలీసులు వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సంతోష్ వాహనదారులను ఆపి, వారికి గులాబీ పువ్వులు అందజేస్తూ క్షేమంగా ఇంటికి చేరాలని సూచించారు. "రోడ్డు ప్రమాదానికి గురైతే చికిత్స కోసం లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఆ ప్రమాదాల వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. మద్యం సేవించి వాహనాలు నడపడం ఆత్మహత్యతో సమానం. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, వాహనం నడిపే వారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అతివేగం ప్రాణాంతకమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం వల్ల ప్రాణనష్టాన్ని నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఇసుక అక్రమార్కులపై ఉక్కుపాదం

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** జిల్లాలో ఇసుక అక్రమ రవాణా, అక్రమ నిల్వలు మరియు విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో ఎస్పీ సంకీర్త్ తో కలిసి రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, రవాణా, టీజీఎండీసీ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గతంలో అమల్లో ఉన్న మాన్యువల్ కూపన్ల విధానాన్ని ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసిందని కలెక్టర్ వెల్లడించారు. ఇకపై ఇసుక అవసరమైన లబ్ధిదారులు తప్పనిసరిగా "మన ఇసుక వాహనం" యాప్ ద్వారానే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈ నూతన విధానం ద్వారా పంపిణీలో పారదర్శకత పెరుగుతుందన్నారు. ఇరిగేషన్ మరియు టీజీఎండీసీ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి జిల్లాలోని ఇసుక రీచ్‌లను గుర్తించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ, అక్రమంగా ఇసుక తరలిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇసుక రీచ్‌లు, వాగుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచుతామన్నారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను పెంచాలని, ఓవర్‌లోడింగ్ వాహనాలపై రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమంగా ఇసుక నిల్వ చేసే డంపులను గుర్తించి కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, రవాణా అధికారి సంధాని, ఆర్డీఓ హరి కృష్ణ, ఇరిగేషన్ ఈఈ బసవ ప్రసాద్ పాల్గొన్నారు.

# ముగ్గుల పోటీలు మన సంస్కృతికి వారధులు

◆ కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రాచీన ఆచారాలను, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ముగ్గుల పోటీలు ఎంతో దోహదపడతాయని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని ముకుందా కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కమిటీ అధ్యక్షులు భూక్య వీరన్న అధ్యక్షతన ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కార్పొరేటర్ రవి మాట్లాడుతూ.. ఇలాంటి పోటీలు మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడమే కాకుండా, వారిలో పోటీతత్వాన్ని పెంచుతాయన్నారు. బహుమతులు రాని వారు నిరాశ చెందకుండా, రాబోయే రోజుల్లో విజయం సాధించే దిశగా పయనించాలని సూచించారు. ముకుందా కాలనీ అభివృద్ధి కమిటీ కేవలం కాలనీ సమస్యలకే పరిమితం కాకుండా, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రంగురంగుల ముగ్గులతో అలరించిన మహిళల్లో విజేతలను న్యాయనిర్ణేత పరంకుశం పద్మ ఎంపిక చేశారు. ప్రథమ బహుమతి స్వప్న, ద్వితీయ బహుమతి ముత్తినేని సిరి, తృతీయ బహుమతి గుగులోత్ కుట్టిలు నిలవగా విజేతలకు కార్పొరేటర్ మరుపల్ల రవి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పోటీలో పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ ప్రధాన కార్యదర్శి ఉల్లి కవిత, కోశాధికారి డాక్టర్ ధనసరి కృష్ణవేణి, గౌరవ సభ్యులు జాటోత్ భాస్కర్, ఉల్లి శ్రీకర్, కాలనీ సభ్యులు ముత్తినేని రజిత, శంకేసి సంధ్య, భాగ్య, సుప్రియ, అక్షర, కుసుమ, సాహితి, నివేదిత తదితరులు పాల్గొన్నారు.

## కామెడీ పండించిన మనశంకర వరప్రసాద్

సాధారణంగా చిరంజీవి సినిమా అంటే .ఓష్...దానికి తోడు ప్రత్యేక పాత్రలో వెంకటేశ్ తోడయ్యాడు. ఇంకేముందీ.. అంచనాలు అంబరాన్ని తాకాయి. విడుదలైన ప్రచార చిత్రాలన్నీ సినిమాపై అంచనాలను రెట్టింపు చేశాయి. ఇక హిట్ మిషిన్ అనిల్ రావిపూడి ఈ సినిమాకు దర్శకుడు కావడంతో విజయం తథ్యం అని జనాలంతా ఫిక్సయిపోయారు. ఇంతటి పాజిటివ్ వాతావరణం మధ్య ఎట్టకేలకు సోమవారం 'మన శంకర వరప్రసాద్‌గారు' సంక్రాంతికి వచ్చేశారు. కథలోకి వెళితే... కేంద్రమంత్రి శర్మ(శరత్ సక్సేనా) కు 'నిన్ను చంపేస్తున్నాం' అంటూ ఓ హంతకుల గ్యాంగ్ నుంచి బెదిరింపు కాల్ రావడం.. ఆయన దగ్గర పనిచేస్తున్న నేషనల్ సెక్యూరిటీ ఆఫీసర్ శంకర్‌వరప్రసాద్(చిరంజీవి) ఆ గ్యాంగ్‌ని తుదముట్టించడంతో కథ మొదలవుతుంది.

శంకర్‌వరప్రసాద్‌ని శర్మ తన కుటుంబ సభ్యుడిగా చూసుకుంటూ ఉంటాడు. ఎప్పుడూ సరదాగా ఉండే శంకరప్రసాద్ మనసులో ఏదో బాధ ఉన్నదని గ్రహించిన శర్మ.. ఓ రోజు శంకరప్రసాద్‌ని కారణం అడుగుతాడు. భార్యతో విడిపోవడం.. కన్నబిడ్డలకు దూరం కావడం.. ఇవే శంకర వరప్రసాద్ బాధకు కారణాలని శర్మకు అర్థమవుతుంది. అందుకే ఓ బోర్డింగ్ స్కూల్‌లో చదువుకుంటున్న పిల్లల్ని కలుసుకునే ఏర్పాటు చేస్తాడు శర్మ. ఆ స్కూల్‌లో పీఈటీగా జాయిన్ అయిన శంకర వరప్రసాద్.. తన పిల్లలకు ఎలా చేరువయ్యాడు? అసలు శంకరప్రసాద్ భార్యతో విడిపోవడానికి కారణం ఏంటి? చివరకు ఆ కుటుంబం ఎలా కలిసింది? అనే ప్రశ్నలకు సమాధానమే మిగతా కథకథగా చెప్పుకుంటే పెద్దగా కథేం కాదు. కానీ ఉన్న కథను క్యూట్‌గా.. ఎక్కడా అనవసరపు పాత్రలు కానీ, సన్నివేశాలు కానీ లేకుండా అర్థవంతంగా నడిపాడు దర్శకుడు అనిల్ రావిపూడి. సాధారణంగా ఇలాంటి కథలకు లాజిక్కులు వెతక్కూడదు. ఈ సినిమాలో కూడా కొన్ని లాజిక్ లేని విషయాలున్నా అవి ఆడియన్స్‌ని అంతగా ఇబ్బంది పెట్టవ్. అపార్థం చేసుకొని విడిపోయిన భార్యకు తానేంటో అర్థం కావాలని తపించే భర్త కథ ఇది. దూరమైన బిడ్డలను అక్కున చేర్చుకోవాలని తహతహలాగే ఓ తండ్రి కథ ఇది. ఈ కథ చుట్టూ వినోదాన్ని మేళవించి జనరంజకంగా మలిచాడు దర్శకుడు అనిల్ రావిపూడి. ప్రధాన పాత్రల మధ్య ఏర్పాడే ఆయా పరిస్థితుల నుంచి పుట్టే కామెడీనే ఈ సినిమాలో ఆద్యంతం కనిపిస్తుంది.


సిట్యువేషనల్ కామెడీ కావడంతో సినిమా ఎక్కడా విసుగు రాలేదు. ప్రథమార్ధం పాత్రల పరిచయాలు, హీరోహీరోయిన్లు కలవడం, విడిపోవడం, దానికి సంబంధించిన పరిస్థితుల నేపథ్యంలో సాగింది. సమస్యలు సీరియస్‌వే అయినా.. చెప్పడం మాత్రం వినోదంగా చెప్పాడు. ఈ కథలో విలన్ పాత్ర గురించి ప్రత్యేకించి చెప్పాలి. చిరంజీవి సినిమాల్లో విలన్ అంటే అత్యంత శక్తిమంతుడిగా, ప్రమాదకారిగా కనిపిస్తాడు. కానీ ఈ సినిమాలో ప్రధాన విలన్ ఓ కామన్ మ్యాన్ కావడం విశేషం. అతను విలన్‌గా మారే పరిస్థితులు కూడా లాజికల్‌గానే అనిపిస్తాయి. అసలు విలన్ కామన్ మ్యాన్ అవ్వడం వల్లే ఈ కథలో ఆసక్తి ఇంకాస్త పెరిగిందనాలి.ద్వితీయార్ధం కొంతభాగం కాస్త సీరియస్ వేలో సాగినా.. చివరి 20 నిమిషాలు వెంకటేశ్ ఎంట్రీతో సినిమా మళ్లీ వినోదంవైపు టర్న్ తీసుకున్నది. వెంకీగౌడాగా తెరపై వెంకటేశ్ చేసిన సందడి అంతా ఇంతా కాదు. ఓ విధంగా ఆయన ఉన్నంతవరకూ తెరపై అందర్నీ డామినేట్ చేశారు. తెరపై చిరంజీవి, వెంకటేశ్ ఒకే ఫ్రేమ్‌లో సందడి చేయడం.. అభిమానులకే కాదు, సగటు ప్రేక్షకుడికి కూడా కన్నుల పండుగ అనిపించింది. సరదాగా ఉన్నప్పుడు 'చంటాబ్బాయి'ని గుర్తు చేస్తూ.. అవసరమైనప్పుడు రౌడీ అల్లుడ్నీ, ఘరనామొగుడ్నీ యాదికి తెస్తూ.. పాటల్లో 'కొండవీటి దొంగ'ను.. యాక్షన్‌లో 'గ్యాంగ్ లీడర్'ని గుర్తు చేస్తూ వింటేజ్ మెగాస్టార్ తెరపై సాక్షాత్కరించారని చెప్పక తప్పదు. ఇక ఇందులో చిరంజీవికి సమానమైన పాత్ర నయనతారది. ఆ పాత్రలో ఉండే దర్పం, అభిజాత్యాన్ని అద్భుతంగా పలికించింది నయనతార. మిగతా నటీనటులంతా తమదైన పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. ఇక ఈ సినిమా ప్రధాన బలాల్లో భీమ్స్ సంగీతం ఒకటి. ప్రతి పాటా జనాలకు నచ్చింది. నేపథ్య సంగీతం కూడా ఆకట్టుకునేలా ఉంది. సమొత్తంగా ఆద్యంతం తనదైన కామెడీతో గిలిగింతలు పెడుతూ.. అక్కడక్కడ ఎమోషన్స్‌తో మనసుల్ని గిల్లుతూ, అవసరమైన చోటా మెగాస్టార్ గ్రేస్‌ని నేటి తరానికి పరిచయం చేస్తూ, అభిమానులకు వింటేజ్ మెగాస్టార్‌ని గుర్తు చేస్తూ.. అద్భుతంగా సినిమాను మలిచాడు దర్శకుడు అనిల్ రావిపూడి.




**కథ చిన్నదే అయినా.. కథనం అద్భుతం**

## శోభితా ధూళిపాళ్ల....చీకటిలో !

**శోభితా ధూళిపాళ్ల ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'చీకటిలో'. అమెజాన్ ప్రైమ్ వేదికగా జనవరి 23 నుంచి స్ట్రీమ్రింగ్ కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు. న్యూస్ ఛానల్‌లో యాంకర్ జాబ్ మానేసి సొంతంగా ఛానల్ పెట్టి స్నేహితుల హత్యల వెనక ఉన్న కారణాన్ని కనిపెట్టే సంధ్య పాత్రలో శోభిత కనిపించారు. సోషల్ మీడియా పోస్ట్‌లో ట్యాగ్ చేసినందుకే హత్య చేశాడా.. అంటూ ఆసక్తికరమైన ప్రశ్నతో ముగించిన ఈ ట్రైలర్‌ను మీరూ చూసేయండి.**






## నిఖిల్ స్వయంభుపై పెరుగుతున్న అంచనాలు

విడుదలకు సిద్ధంగా ఉన్న పాన్ ఇండియా చిత్రాలో 'స్వయంభు' ఒకటి. యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్ నటిస్తున్న ఈ అత్యంత ప్రతిష్టాత్మక చిత్రానికి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తుండగా,సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ సినిమాకు ఠాగూర్ మధు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. కాగా ఈ చిత్రం ఫిబ్రవరి 13, 2026న ప్రపంచవ్యాప్తంగా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. అయితే తాజాగా ఈ మూవీ గురించి ఇంట్రెస్టింగ్ న్యూస్ వైరల్ అవుతుంది.పిరియాడికల్ మైథలాజికల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఇంటర్వల్ సీక్వెన్స్ హైలైట్ కాబోతోందట. ఈ సీన్‌లో నిఖిల్ ఇతర ప్రధాన పాత్రల మధ్య వచ్చే యాక్షన్ విజువల్స్ చాలా వైల్డ్ గా, రా గా ఉంటాయని సమాచారం. ముఖ్యంగా ఈ యాక్షన్ సీక్వెన్స్‌లో నిఖిల్ గెటప్, యుద్ధ సన్నివేశాల సెటప్ ప్రేక్షకులను థ్రిల్ కి గురిచేస్తాయని ఇన్సైడ్ టాక్. 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతం, సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ ఈ సీన్స్‌ను మరో లెవల్‌కు తీసుకెళ్లనున్నాయట. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేయగా, ఈ లేటెస్ట్ యాక్షన్ అప్‌డేట్ నిఖిల్ అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది.




## సంక్రాంతి సందడి.. రాజాసాబ్‌తో మొదలైన వసూళ్ల జోరు

సంక్రాంతి పండగకు వచ్చే ప్రతి సినిమానీ ప్రేక్షకులు ఆదరిస్తారనే ఓ భరోసా పరిశ్రమలో కనిపిస్తుంటుంది. అందుకే పండగే లక్ష్యంగా పలు సినిమాలు తెరకెక్కుతూ ప్రేక్షకుల ముందుకొస్తుంటాయి. ఈసారి పండగకు ప్రేక్షకుల ముందుకొస్తున్న తెలుగు సినిమాలు... ఐదు. వాటిలో అగ్ర కథానాయకుల సినిమాలున్నాయి, యువ తారల సినిమాలూ ఉన్నాయి. వీటన్నిటి థియేట్రికల్ వ్యాపార లావాదేవీల విలువ రూ.600 కోట్లు పైమాటే అనేది పరిశ్రమ వర్గాల లెక్క. ఇదివరకు ఏ సీజన్‌లోనూ ఇంత భారీ స్థాయిలో లావాదేవీలు జరగలేదు. ఈ సినీ సంక్రాంతి ఎంత తిరిగి రాబట్టుకుంటుందో కానీ... ప్రేక్షకుల్లో ఉత్సాహం మాత్రం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ప్రభాస్ 'ది రాజాసాబ్', చిరంజీవి కథానాయకుడిగా నటించిన 'మన శంకరవరప్రసాద్‌గారు' చిత్రాలు ఇప్పటికే ప్రేక్షకుల ముందుకొచ్చాయి. తెలంగాణలో ముందస్తు ప్రదర్శనలు లేకపోయినా, తొలి ఆట తర్వాత మిశ్రమ స్పందన వచ్చినా 'ది రాజాసాబ్' తొలి రోజు వసూళ్లు అదిరి పోయాయి ఆదివారం రాత్రి ప్రత్యేక ప్రదర్శనల తోనే విడుదలైన చిరంజీవి 'మన శంకరవరప్రసాద్‌గారు' సినిమాకీ అదిరిపోయే ప్రారంభం దక్కింది. అమెరికాలో ప్రీమియర్ షోలతోనే ఈ సినిమా మిలియన్ డాలర్ మార్క్‌కి చేరువైపోయింది. అన్ని సినిమాలూ కుటుంబ వినోదంతో రూపొందిన సినిమాలు కావడమే అందుకు కారణం.13న రవితేజ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి', 14న నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒక రాజు', అదే రోజున శర్వానంద్ 'నారీ నారీ నడుమ మురారి' చిత్రాలు విడుదలవుతున్నాయి. వీటి ప్రచార చిత్రాలు వినోదంతో ఊరిస్తున్నాయి. మిగతా సినిమాలతో పోలిస్తే, ఈ మూడు సినిమాలు పరిమిత వ్యయంతో రూపొందినవే. అయితే పండుగ సందర్భంగా ఇంటిల్లిపాదినీ అలరించే వినోదంతో వచ్చిన చిన్న సినిమాలూ గతంలో ఘన విజయాల్ని అందుకున్నాయి. అందుకే చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి పండగ సినిమాపైనా ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన అంచనాలు ఉంటాయి.



# తెలుగు లోగిళ్లలో..

# భోగి... భాగ్యం

### ☐ అచ్చ తెలుగుదనానికి ప్రతీక

భారతీయ సంస్కృతిలో పండగలది విశేష స్థానం. ప్రతి పండగకూ పరమార్థం ఉంది. ఇందులో కాలనుగుణంగా పండగలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. భోగి, సంక్రాంతి, కనుమ అన్నవి దక్షిణాయం నుంచి ఉత్తరాయణ ప్రయణానికి సూచికగా గుర్తించాలి. సూర్య గమనం ముందు ఇదో విశేషం. దక్షిణాయనంలో సూర్యుడు రోజు రోజుకి భూమికి దక్షిణం వైపుగా కొద్ది కొద్దిగా దూరమవుతూ దక్షిణ అర్ధగోళంలో భూమికి దూరం కావడంతో భూమిపై బాగా చలి పెరుగుతుంది. ఈ చలి వాతావరణాన్ని తట్టుకునేందుకు ప్రజలు సెగ కోసం భగ భగ మండే చలి మంటలు వేసుకునేవారు. ఉత్తరాయణం ముందురోజుకి చలి విపరీతంగా పెరగడం ఈ చలిని తట్టుకునేందుకు భగ భగ మండే మంటలు అందరు వేయటం వలన ఈ రోజుకు భోగి అనే పేరు వచ్చిందనే ప్రచారం ఉంది. శాస్త్రీయ కారణాల ప్రకారం, సూర్యుడు దక్షిణయానం కాలంలో భూమికి దూరంగా ఉండటంతో ఉష్ణోగ్రతలు తగ్గి చలి తీవ్రత పెరుగు తుంది. ఈ చల్లని వాతావరణాన్ని తట్టుకునేందుకు, చలి బాధలను తప్పించుకునేందుకు, దక్షిణా యానంలో తాము పడిన కష్టాలు, బాధలను తట్టుకున్నందుకు.. ఉత్తరాయణ కాలంలో సుఖ సంతోషాలను కోరుకుంటూ భోగి మంటలను వేస్తారు. భుగ్ అనే సంస్కృత పదం నుంచి భోగి అనే పదం వచ్చిందని చరిత్ర ద్వారా తెలుస్తోంది. భోగం అంటే సుఖం. పురాణాల ప్రకారం, శ్రీ రంగనాథ స్వామిలో గోదాదేవి లీనమై భోగాన్ని పొందిందని.. దానికి సంకేతంగానే భోగి పండుగ ఆచరణలో వచ్చినట్లు పెద్దలు చెబుతారు.



మరో కథనం మేరకు.. శ్రీ మహా విష్ణువు వామనుడి అవతారంలో వచ్చి బలి చక్రవర్తిని పాతాళంలోకి తొక్కింది కూడా భోగి రోజునే. ఇంకోవైపు ఇంద్రుడి పొగరును అణచివేస్తూ గోవర్ధన పర్వతం ఎత్తిన పవిత్రమైన రోజు కూడా భోగి రోజే అని పెద్దలు చెబుతారు. అంతేకాదు రైతుల కోసం ఈశ్వరుడు నందిని భూమికి పంపిన పవిత్రమైన రోజునే భోగి రోజు అని.. అందుకే ఈరోజు భోగి పండుగను జరుపుకుంటారు. జనవరి నెలలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది కాబట్టి సాధారణంగా చలి మంటలను వేసుకుంటారు. కానీ భోగి మంటలనేవి కేవలం చలి తీవ్రత నుంచి తప్పించుకునేందుకు మాత్రమే కాదు.. ఆరోగ్య ప్రయోజనాల కోసం కూడా వేస్తారు. సంక్రాంతి పండక్కి సరిగ్గా నెలరోజుల ముందు ధనుర్మాసం ప్రారంభమవుతుంది. ఈ సమయంలో ఇంటి ముందు పెట్టిన గొబ్బెమ్మలను పిడకలుగా చేస్తారు. వాటినే భోగి మంటల్లో వేస్తారు. వీటిని కాల్చడంతో గాలి శుద్ధి అవుతుంది. సూక్ష్మ క్రిములు నశిస్తాయి. మనకు శ్వాసకోశకు సంబంధించిన అనేక రోగాల నుంచి ఉపశమనం లభిస్తుంది. భోగి మంటల్లో పిడకలతో పాటు రావి, మామిడి, మేడి, ఔషధ చెట్ల కలప, ఆవు నెయ్యి వేస్తారు. ఆవు నెయ్యి, ఆవు పిడకలను మంటల్లో వేయడం వల్ల శక్తివంతమైన గాలి విడుదలవుతుంది. అందుకే భోగి మంటలను ప్రతి పలెటూళ్లో విధిగా వేస్తారు. అంతేకాదు ఊళ్లో ఉండే వారందరినీ కులాలకు అతీతంగా అందరినీ ఒకేచోట చేర్చి, ఐక్యమత్యం పెంచడంలో కూడా భోగి ఎంతగానో ఉపయోగపడుతుంది. అంతేకాదు అగ్నిదేవుడిని ఆరాధిస్తూ.. వాయుదేవునికి గౌరవం ఇచ్చినట్టు భోగి పండుగ రోజున సాయంత్రం వేళలో బొమ్మల కొలువు నిర్వహిస్తారు. ఇదే రోజున చిన్నారుల తలపై భోగి పళ్లను పోస్తారు. ఇదే రోజున బదరీ వనంలో శ్రీహరిని పిల్లాడిగా మార్చి దేవతలంతా బదరీ పళ్ల(రేగు పళ్లు)తో అభిషేకం చేశారు. అవే కాలానుగుణంగా వచ్చిన మార్పులో భోగి పళ్లుగా మారాయి. వీటితో పాటు పూలు, శనగలు కూడా కలిపి చిన్నారులపై వేయడం వల్ల వారు ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతారని చాలా మంది నమ్ముతారు.

## సంస్కృతికి ప్రతిబింబం సంక్రాంతి

భారతీయ పండుగలు కేవలం వినోదానికి వేదికలు కావు.. అవి ఉదాత్తమైన జీవన విలువల పాఠశాలలు. కాలచక్రంలో వచ్చే మార్పులను ఆహ్వానిస్తూ, ప్రకృతితో మమేకమయ్యే అద్భుత సందర్భం 'సంక్రాంతి'. భోగి, సంక్రాంతి, కనుమ.. ఈ మూడు రోజులు మన సంస్కృతికి మూడు ముఖాలుగా నిలుస్తాయని హనుమకొండ శ్రీ శిరిడి సాయిబాబా మందిర ధర్మకర్త శ్రీ నిమ్మల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ పర్వదినాల వెనుక ఉన్న పరమార్థాన్ని ఆయన విశ్లేషించారు. భోగి అంటే శుద్ధి. ఇంటిలోని పాత సామాగ్రిని మంటల్లో వేయడం వెనుక ఒక గూఢార్థం ఉంది. పాత వస్తువులతో పాటు మన మనసులోని భారాన్ని, అలసటను, పాత జ్ఞాపకాలను వదిలివేసి నూతన ఆశలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలకడమే భోగి అసలు ఉద్దేశం. "పాతదాన్ని వదిలితేనే కొత్తదానికి చోటు దక్కుతుంది" అనే జీవన తత్వాన్ని భోగి మనకు బోధిస్తుంది.

సూర్యుడు మకర రాశిలో ప్రవేశించి ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమయ్యే రోజే మకర సంక్రాంతి. ఇది రైతు పండుగ, శ్రమజీవి ఆనంద తరంగం. పండిన ధాన్యం చేతికొచ్చిన వేళ.. సూర్యుడికి, భూమాతకు కృతజ్ఞతలు చెప్పుకునే పండుగ ఇది. ముగ్గులు, గొబ్బెమ్మలు, హరిదాసుల కీర్తనలు, ఆకాశంలో రంగురంగుల పతంగులు.. ఇవన్నీ మన గ్రామీణ సంస్కృతికి ప్రాణవాయువు లాంటివి. రైతు జీవితంలో అంతర్భాగమైన పశువులను గౌరవించుకునే రోజే కనుమ. కష్టం తెలిసిన మనసే కృతజ్ఞతను గుర్తిస్తుంది. అందుకే మనకు చేదోడుగా నిలిచే గోవులను, ఎద్దులను పూజించడం మన సంస్కృతిలోని ఉన్నతమైన మానవత్వాన్ని చాటిచెబుతుంది. బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు చేయడం కుటుంబ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుంది. భోగి: మనకు 'మార్పు' నేర్పుతుంది. సంక్రాంతి: మనకు 'కృతజ్ఞత' నేర్పుతుంది. కనుమ: మనకు 'గౌరవం' నేర్పుతుంది. ఈ మూడు రోజులు మన సంస్కృతి ఊపిరిగా, మన జీవితాలకు దారి చూపే దీపాలుగా నిలుస్తాయి.



వ్యాస కర్త :
నిమ్మల శ్రీనివాస్
ఫోన్:
99497 09866

## గాంధీల పేరుతో కాంగ్రెస్ నయవంచన

### బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాంగ్రెస్ పార్టీ గాంధీల పేరుతో నిరుపేదలను నయవంచనకు గురి చేస్తోందని భారతీయ జనతా పార్టీ వారంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యే మార్తనేని ధర్మారావు ఆరోపించారు. మంగళవారం బీజేపీ 'వీబీ జీ రామ్ జీ' చట్టంపై కొత్తవాడ ఎస్ఎస్ కే సమాజ్ హాల్ లో ప్రోగ్రాం జిల్లా కన్వీనర్ మల్లాడి తిరుపతి రెడ్డి అధ్యక్షతన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా గంట రవికుమార్, మార్తినేని ధర్మారావు పాల్గొని మాట్లాడుతూ.. వికసిత్ భారత్ పేరుతో మోదీ పేద ప్రజలను ఆదుకోవడం లక్ష్యంగానే ఈ 'వీబీ జీ రామ్ జీ' ఉపాధి హామీ పథకం మార్పు చేయడం జరిగిందన్నారు. వ్యవసాయానికి బాసటగా ఉండేలా ఈ పథకాన్ని మార్పు చేసిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని పేదల ఎదుగుదలకు ఉయోగాడెలా రూపొందించారు. ప్రపంచ దేశాలతో పోటీ పడాలంటే మార్పు అవసరం అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి హామీ నిధులను దారి మళ్లించి అవినీతికీ పాల్పడితే మోదీ ప్రభుత్వం ప్రతి పైసా పేదలకు చేరేలా అకౌంటబిలిటీ ఏర్పాటు చేయడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారని మండిపడ్డారు. అవినీతిని రూపుమాపి పేదలను అభివృద్ధిలో భాగస్వాములను చేయడం లక్ష్యంగా వికసిత్ భారత్ పేరుతో ఉపాధి నిర్వహణను చేయబోతున్నామన్నారు. ఇన్ని రోజులు కాంగ్రెస్ పార్టీ గాంధీ పేరుతో చేసిన నాటకాలను ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. అసలు గాంధీలు ఎవరు నకిలీ గాంధీలు ఎవరో ప్రజలకు బాగా తెలుసన్నారు. కాంగ్రెస్ పాలనలో సంక్షేమ పథకాలన్నీ అవినీతిమయం అయ్యాయని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నేరుగా పేద ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తూ ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, జిల్లా గడల కుమార్, జిల్లా కార్యదర్శిలు గుడిపూడి రాధాకృష్ణ, రాయబారపు కుమారస్వామి, జిల్లా మీడియా కన్వీనర్ అంకాల జనార్ధన్, బీజేపీ జిల్లా నాయకులు పైర్ధ ఆనంద్, జెట్లింగ్ శివప్రసాద్, వెంకట్రావ్, తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మసీ ఆఫీసర్లకు గుడ్ న్యూస్

- తొమ్మిది నెలల పెండింగ్ వేతనాలు చెల్లిస్తాం
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీ



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** 104 ఎఫ్డీహెచ్ఎస్ లో పని చేస్తున్న ఫార్మసీ ఆఫీసర్స్ కు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సంక్రాంతి పర్వదినం సందర్భంగా గుడ్ న్యూస్ చెప్పారు. ఏప్రిల్ 2025 నుంచి డిసెంబర్ 2025 వరకు తొమ్మిది నెలలు పెండింగ్ వేతనాలు చెల్లించేలా ఈరోజే ప్రిన్సిపల్ సెక్రటరీతో మాట్లాడుతానని మంత్రి హామీ ఇచ్చారు. మంగళవారం తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీపీఓఏ) రాష్ట్ర అధ్యక్షులు బత్తిని సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో మంద్రి దామోదర రాజనర్సింహను బంజారా హిల్స్ లోని మంద్రి క్యాంప్ ఆఫీస్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి శాలువా కప్పి, పూల బోకేను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో ఫార్మసీ ఆఫీసర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై అరగంటకు పైగా మంత్రితో చర్చించారు. 104 ఎఫ్ డీహెచ్ఎస్ లో పనిచేస్తున్న ఫార్మసీ ఆఫీసర్స్ కు పెండింగ్ లో ఉన్న 10 నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని, మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్ మెంట్ బోర్డు ద్వారా పరీక్షలు రాసిన ఫార్మసీ ఆఫీసర్స్ కు వెంటనే ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ రిలీజ్ చేసి అర్హులైన 732 ఫార్మసీ ఆఫీసర్స్ కు నియామక ఉత్తర్వులు ఇవ్వాలని, ప్రతీ పీహెచ్ సీకి అదనంగా ఇద్దరు ఫార్మసీ ఆఫీసర్స్ పోస్టులు మంజూరు చేయాలని, అదే విధంగా ఫార్మసీ ఆక్ట్ 1948,సెక్షన్ 42 ప్రకారం ప్రతీ పల్లె, భస్తీ ధవాఖానాల్లో ఫార్మసీ ఆఫీసర్స్ ను నియమించాలని, ప్రతీ పీహెచ్ సీ లో డాటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులను మంజూరు చేయాలని చేయలని మంత్రిని కోరారు. ఈ మేరకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు బత్తిని సుదర్శన్ గౌడ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కంద కట్ల శరత్ బాబు, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ జాలిగామ అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలువేరి ఉదయ్ ప్రసాద్, పద్మజ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఏవీ శ్రీహరి, జనరల్ సెక్రెటరీ ఎస్.ఆనంద్ కుమార్, కె. కళ్యాణ్, రాధిక, అలేఖ్య, అర్చన, భాను ప్రియ, గోదావరి, ఎ.దీపిక, స్రవంతి, కావ్య, భవాని, అనిత, మానస, వెంకట రమణ, నాయకులు శివ కుమార్, శ్రవణ్ కుమార్, వేణు, నారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com